సాక్షి వరంగల్

శనివారం | 28 | జనవరి | 2023



అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో వారం రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలకు సంబంధించి అంతర్రాష్ట్ర దొంగను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో▸



భారంగా కుటుంబ పోషణ

సీఆర్‌పీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. తక్కువ వేతనం ఇస్తుండటంతో కుటుంబ పోషణ భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5^0 / 19.0^0

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. సాయంత్రం పొగమంచు కారణంగా చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేటి నుంచి మెడికల్ క్యాంపులు

కాజీపేట సెంటర్: జిల్లాలో ప్రిఫరెన్షియల్ కేటగిరి వినియోగించుకునే ఉపాధ్యాయులకు మెడికల్ సర్టిఫికెట్స్ జారీ కోసం నేటి (28) నుంచి ఈనెల 30వ తేదీ వరకు మూడు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంజీఎం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (నర్సంపేట, వర్ధన్నపేట)లో క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులకు ఉపాధ్యాయులు హాజరై సర్టిఫికెట్స్ పొందాలని తెలిపారు.

దేశీ మిర్చి @ రూ.71వేలు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం దేశీమిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.71 వేలు పలికిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వండర్‌హాట్ మిర్చి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.36,500, కనిష్ట ధర రూ.30వేలు పలికిందన్నారు. అలాగే పత్తి క్వింటాల్‌కు రూ.7,690, కనిష్ట ధర రూ.6,500 పలికింది. లూజ్ పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7,700, కనిష్ట ధర రూ. 7,400 పలికింది. మొత్తం 5,338 పత్తి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

150 మందికి తగ్గకుండా పరీక్షలు చేయాలి

డీఎంహెచ్‌ఓ వెంకటరమణ



దుగ్గొండి: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ప్రతి సెంటర్‌లో 150 మందికి తగ్గకుండా కంటి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. మండలంలోని దుగ్గొండి, లక్ష్మీపురం గ్రామాల్లో జరుగుతున్న కంటి వెలుగు పరీక్ష కేంద్రాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కంటి అద్దాలు అవసరం ఉన్నవారికి స్వయంగా కంటి అద్దాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, కిరణ్‌రాజ్, హుస్సేన్, భరత్, ప్రతాపగిరి ప్రసాద్, సాంబయ్య, భాస్కర్‌గౌడ్, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాప్రస్థానం పాదయాత్రను విజయవంతం చేయాలి

నర్సంపేట: ఫిబ్రవరి 2న ప్రారంభమయ్యే ప్రజా ప్రస్థానం పాదయాత్రను విజయవంతం చేయాలని వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేటి (శనివారం) నుంచి నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండలంలోని శంకరం తండా గ్రామం నుంచి పాదయాత్ర పునఃప్రారంభం కావాల్సి ఉండగా పోలీసులు అనుమతి ఇవ్వలేదన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి పాదయాత్ర చేసుకోవాలని అనుమతి ఇచ్చారన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మిగిలిన ఎనిమిది నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. పాదయాత్ర వరంగల్ జిల్లాలో ముగించుకుని ఫిబ్రవరి మూడో వారంలో పాలేరు నియోజకవర్గంలో పాదయాత్ర ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ పాదయాత్రకు నియోజకవర్గంలోని వైఎస్‌ఆర్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

30న జాబ్‌మేళా

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు అపోలో కంపెనీ, హైదరాబాద్‌లో ఉద్యోగాల ఎంపిక కోసం ఈ నెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్టుకు డీ/బీ/ఎం ఫార్మసీ, ఫార్మసీ అసిసెంట్, అప్రెంటిస్‌షిప్‌కు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30న ఉదయం 11వరకు వారి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ములుగురోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 82476 56356 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి
పరీక్షా పే చర్చలో ప్రధాని మోదీ

పీఎఫ్ సమస్యలు నేరుగా పరిష్కరించుకోండి

రైల్వే ఇనిస్టిట్యూట్ అభివృద్ధికి కృషి

10 లో

శివాలయం వద్ద భక్తుల రద్దీ



పూజలో పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దంపతులు, ఎమ్మెల్యే పెద్ది దంపతులు



నృత్యం చేస్తున్న కళాకారులు



వైభవంగా శివాలయ పునఃప్రతిష్ఠాపన

పర్వతగిరి మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం లింగార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీ సమేతంగా హాజరయ్యారు. - పర్వతగిరి - వివరాలు 10లో▸

బస్తాపై కుస్తీ!

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మళ్లీ గన్నీ బ్యాగుల లొల్లి

- బస్తా బరువు కింద కిలో 100 గ్రాముల తరుగు తీయాలి
- 25 కిలోలలోపు, 49 కిలోలు దాటితే అదనంగా తరుగు
- అమలు కాని ఖమ్మం మార్కెట్ నియమ నిబంధనలు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన చాంబర్ ప్రతినిధులు
- ఫిబ్రవరి 4న సమావేశం!



సాక్షి, వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మళ్లీ లొల్లి షురువైంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నియమ నిబంధనల ప్రకారం వరంగల్‌లో కూడా గన్నీ బ్యాగులకు మిగిలిన అంశాలను అమలు చేయాలనే డిమాండ్ తెరమీదకు వచ్చింది. గతంలో గన్నీ బ్యాగులకు రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో రైతు సంఘ నాయకులు ఉద్యమించడంతో కొన్ని రోజులుగా బ్యాగుకు రూ.30లు ఖరీదుదారులు చెల్లిస్తున్నారు. ఇది ఇంతవరకు బాగానే ఉన్నా మిగిలిన అంశమైన ఒక్కో 45 కిలోల బ్యాగులో కిలో 100 గ్రాముల తరుగును కూడా తీయాలనే నిబంధనను కూడా అమలు చేయాలని వ్యాపారులు అంటున్నారు. అలాగే కొంతమంది రైతులు తక్కువగా కిలోలు తీసుకొస్తున్న బస్తాను కూడా కోల్డ్ స్టోరేజీలకు రవాణా చేయాలన్న లారీ వాళ్లకు ఒక్కో బస్తాకు రూ.150 చెల్లించాల్సి వస్తోంది. దీనివల్ల బరువు తక్కువగా ఉన్న బస్తాలు ఎక్కువగా రావడంతో అదనంగా రవాణా ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఎక్కువ కిలోల బస్తాలు రావడంతో కోల్డ్ స్టోరేజీలో ఉండడం వల్ల మిర్చి దగ్గరదగ్గరగా ఉండి ఒత్తుకపోవడంతో ఫంగస్ వచ్చి పాడైపోతుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రతి బస్తా 45 కిలోలు ఉండేలా రైతులు తొక్కుకొని తీసుకురావాలని వ్యాపారులు అంటున్నారు.

మంత్రి ఆదేశాలతో ఖమ్మం మార్కెట్‌కు..

గతంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, కలెక్టర్ గోపి సూచనల మేరకు ఖమ్మం మార్కెట్‌లో రైతు సంఘం నాయకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, మార్కెట్ ఉన్నతాధికారులు వెళ్లి అక్కడి నిబంధనలు తెలుసుకొని వచ్చారు. ప్రస్తుతం కేవలం ఖాళీ గన్నీ బ్యాగుల ధరను మాత్రమే అమలు చేస్తున్నారు. మిగిలిన వాటి అమలును మరిచారని వ్యాపారులు మూడు రోజుల క్రితం కొంతసేపు కొనుగోలు నిలిపేసి మార్కెట్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయాలపై చర్చించేందుకు కలెక్టర్ గోపి ఫిబ్రవరి 4వ తేదీన సమయం ఇవ్వడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో రైతు సంఘాల నాయకులు, మార్కెట్ అధికారులు, చాంబర్స్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు తదితరులు సమావేశం కానున్నారు.

అక్కడ ఏం చేస్తున్నారంటే..

- ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఒక బస్తా బరువు కింద కిలో 100 గ్రాములు తరుగు తీస్తున్నారు. ఒక వేళ మిర్చి సరుకు ఒక బస్తా బరువు 25 కిలోలలోపు లేదా 49 కిలోల కన్నా ఎక్కువ వచ్చినట్లయితే బస్తా బరువు ఒక కిలో 100 గ్రాముల తరుగుతో పాటు అదనంగా ఒక కిలో తరుగు తీస్తున్నారు. రైతులకు బస్తా బరువు 40 కిలోల నుంచి 45 కిలోలు తీసుకువచ్చేలా చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం అమలు చేస్తున్నారని అక్కడి అధికారులు అంటున్నారు.
- పత్తి బస్తా 25 కిలోల లోపు, 60 కిలోల పైన బరువుతో తెస్తే ఆ బస్తాలను తూకంలో మిర్చి మాదిరిగానే ఒక కిలో 100 గ్రాములతో పాటు మరొక కిలో తరుగు తీసేస్తున్నారు. దీనివల్ల 90 శాతం రైతులు 25 కిలోల నుంచి 49 కిలోలలోపే మిర్చిని బస్తాలో తెస్తున్నారు. పత్తి కూడా 25 కిలోల నుంచి 60 కిలోలలోపే తీసుకువస్తున్నారు.

అన్నింటినీ అమలు చేయాలి..



ఖమ్మంలో మాదిరిగానే ఖాళీ గన్నీ సంచులకు ధర చెల్లించినట్టుగానే ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో కూడా ఆచరణలోకి తీసుకురావాలి. నవంబర్ 21న మంత్రి దయాకర్‌రావు ఆదేశాల మేరకు నవంబర్ 24న ఖమ్మం మార్కెట్‌ను సందర్శించారు. ఈ నివేదికకు సంబంధించి ఇంతవరకు సంయుక్త సమావేశం ఏర్పాటు చేయలేదు. అయినా ఖరీదు దారులు గన్నీ బ్యాగులకు ధర చెల్లిస్తున్నారు. అయితే జనవరి 10లోపు బ్యాగు టేర్ వెయిట్ (తారం) విషయంలో ఖమ్మం మార్కెట్ విధానాన్ని అవలంభించాలని మార్కెట్ కార్యదర్శికి లేఖ రాసినా ప్రయోజనం లేదు. అందుకే ఇటీవల రెండు గంటల పాటు మిర్చి అమ్మకాలు నిలిపాల్సి వచ్చింది.

- రవీందర్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

రైతులకు అనుకూల నిర్ణయం ఉండాలి



ఏనుమాముల మార్కెట్‌కు ఎంతో దూరం నుంచి వస్తున్న రైతులకు అన్యాయం జరగొద్దు. అక్కడ కొనుగోలు విషయంలో అమలవుతున్న నిబంధనలపై కలెక్టర్ గోపి సమక్షంలో జరిగే సమావేశంలోనూ రైతులకు అనుకూల నిర్ణయం ఉండేలా చర్చిస్తాం. బస్తాలో తరుగులో కాస్తా నిబంధనలు సడలిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. తెల్ల బ్యాగులకు కూడా ధర ఇవ్వాలి.

- సోమిడి శ్రీనివాస్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

- వీసీలో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ గోపి, డీఈఓ, తదితరులు

కరీమాబాద్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లతో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన, విద్యాశాఖ మౌలిక వసతుల కల్పన సంస్థ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు, సీఎం ఆదేశాల మేరకు టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టడం జరిగిందన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా, అవినీతికి తావు లేకుండా ఆన్‌లైన్ విధానంలో ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేశారు. దీంతో పాటు మన ఊరు-మన బడి కార్యక్రమాన్ని కలెక్టర్‌లు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టర్‌లు తమ జిల్లా పరిధిలో సోలార్ పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా 223 పాఠశాలలో 24 పాఠశాలలకు పెయింటింగ్ పూర్తయిందన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీఈఓ వాసంతి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'లో కరెంట్ కోతలు

- ఇబ్బందుల్లో గ్రామస్తులు



నారక్కపేటలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వేచి ఉన్న ప్రజలు

నల్లబెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమానికి కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంటి పరీక్షలు చేస్తున్న సమయంలో కరెంటు కోతలు ఉండడంతో పరీక్షలకు వచ్చినవారు వేచి ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి...నల్లబెల్లి మండలంలో ఈ నెల 19న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ప్రతి రోజు సుమారుగా 250మందికి పరీక్షలు చేస్తున్నారు. శుక్రవారం నారక్కపేటలో కంటి పరీక్షలకు ఉపయోగించే ఆటోరిఫ్రాక్టర్ యంత్రం కరెంట్ లేకపోవడంతో అంతరాయం ఏర్పడింది. దీంతో వృద్ధులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రత్యామ్నాయంగా జనరేటర్ సౌకర్యాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై కంటివెలుగు ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నగేష్ మాట్లాడుతూ కరెంట్ కోతల విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. నారక్కపేటలో కరెంట్ కోతలతో 30 మందికి పైగా వైద్య పరీక్షలు చేయలేకపోయామని తెలిపారు.

'స్పౌజ్' టీచర్లకు కౌన్సెలింగ్

- హనుమకొండ జిల్లాకు స్పౌజ్ టీచర్లు 33మంది
- ఆరుగురు చెక్‌స్లిప్ బదిలీలపై వచ్చిన వారికి ఉత్తర్వులు జారీ
- వరంగల్ జిల్లాకు 31మంది.. కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి
- నేడు బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్న డీఈఓ వాసంతి



ఎస్‌జీటీ ఉపాధ్యాయుల ఎస్‌బీలను పరిశీలిస్తున్న ఎంఈఓ రాంకిషన్‌రాజు తదితరులు

విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాలకు కేటాయించిన స్పౌజ్ కేటగిరి టీచర్లకు శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వరంగల్ జిల్లాకు 31మంది స్కూల్ అసిస్టెంట్‌లు రాగా, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. వేకెన్సీలను చూపగా వారు కోరుకున్న చోటికి కేటాయించారు. ఈ 31మందికి శనివారం బదిలీ ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. వరంగల్ జిల్లా నుంచి మరో 8మంది ఉపాధ్యాయులు స్పౌజ్ కేటగిరిలో ఇతర జిల్లాలకు వెళ్లారు. హనుమకొండ జిల్లాకు కేటాయించిన 33మంది స్కూల్ అసిస్టెంట్లకు శుక్రవారం రాత్రి 10గంటల వరకు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై కౌన్సెలింగ్ నిర్వహించారు. వేకెన్సీల్లో వారు కోరుకున్న చోటికి బదిలీ చేశారు. ఇక హనుమకొండ జిల్లాకు చెక్ స్లిప్ బదిలీలపై 6 ఉపాధ్యాయులురాగా వారికి డీఈఓ బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఇలా దొడ్డిదారిన బదిలీ ఉత్తర్వులు ఇవ్వడంపై ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లో స్పౌజ్ కేటగిరిల రాకతో పదోన్నతుల వేకెన్సీలు తగ్గనున్నాయని భావిస్తున్నారు.

ఎస్‌జీటీ కేటగిరిల టీచర్ల సర్వీస్ బుక్స్ పరిశీలన

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా పదోన్నతులకు అర్హులైన ఎస్‌జీటీల సర్వీస్ బుక్స్, విద్యార్హతల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం సాయంత్రం వరకు మండలాల్లో ఎంఈఓలు, ఇతర సిబ్బంది పరిశీలించారు. వరంగల్ జిల్లాలో 13మండలాల్లో 462మంది అర్హులు ఉండగా, 10శాతంమంది పరిశీలనకు హాజరుకాలేదు. వారికి ఈ నెల 28న కొనసాగిస్తామని డీఈఓ తెలిపారు. ఇక హనుమకొండ జిల్లాలో 14మండలాల్లో ఎస్‌ఏలకు అర్హులైన ఎస్‌జీటీల సర్వీస్‌బుక్స్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఎంఈఓలు చేశారు. ఈనెల 28నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ షురూ కానుంది.

పోడు భూములకు పట్టాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూరి

నర్సంపేట: పోడు భూములకు పట్టాలివ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలోని ఖనిజ సంపదను అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్, పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు కుట్రపూరితంగా తీసుకువచ్చి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, ప్రజా సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు కోడెం సారంగం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సూరి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు ఏజెన్సీలోని ఆదివాసీ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కార్పొరేట్ పెట్టుబడిదారులతో కుమ్మక్కై కాలరాసే కుట్రలకు పాల్పడుతున్నారు. ఆదివాసీ అటవీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 6, 7 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాలు, ఫిబ్రవరి 13న ఐటీడీఏ కార్యాలయం, ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద భారీ ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల అమలుకు రైతు కూలీ సంఘం కార్యకర్తలు, ఏజెన్సీ ఆదివాసీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నర్సంపేట డివిజన్ నాయకులు అడ్డూరి రాజు, కందిక రమేష్, దార లింగన్న, బానోతు లాలు, మనోహరచారి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు అలవాల నరేష్, రాజేందర్, రాకేష్, రంజిత్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

'సత్యభామ'కు సంతాపం

- 2013లో వరంగల్‌కు వచ్చిన సీనియర్ సినీనటి జమున
- భద్రకాళి, వేయి స్తంభాల ఆలయాల్లో పూజలు..
- ఆమె మృతిపై కవులు, కళాకారుల దిగ్భ్రాంతి



భద్రకాళి దేవాలయంలో నటి జమున (ఫైల్)

హన్మకొండ కల్చరల్: ఈ నేలను, ఇక్కడి కళాఖండాలను ఆమె ఎంతో అభిమానించే వారు. సందర్భమేదైనా.. ఓరుగల్లు కవులు, కళాకారులకు ప్రాధాన్యమిచ్చేవారు. ఆమె ఓరుగల్లుకు వచ్చిన సమయంలో ఇక్కడి శిల్పకళా రాజసాన్ని చేతులతో స్పృశించి పరవశించారు. అద్భుత కట్టడాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్‌తో సీనియర్ సినీ నటి జమునకున్న అనుబంధం అద్వితీయం. ఆమె మృతికి ఇక్కడి కళాకారులు, కవులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీనియర్ నటి జమున 2013 మే 31న వరంగల్‌లోని చారిత్రక ప్రసిద్ధి చెందిన భద్రకాళి దేవాలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వీసీ అనుమాండ్ల భూమయ్య రచించిన 'సౌందర్య లహరి' గీతాలాపనలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. వేయి స్తంభాల దేవాలయాన్ని ఆమె సందర్శించిన సందర్భంగా దేవాలయంలోని మండపాన్ని పరిశీలించి అద్భుతమైన కట్టడమని, కాపాడుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారని ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ గుర్తు చేశారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

నగర ప్రముఖుల సంతాపం..

నటి జమున సత్యభామ పాత్రలో బాగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచారని పలువురు నగరంలోని సీనియర్ నాటక రంగ నటులు, ఓరుగల్లు నాట్య మండలి కార్యదర్శి జేఎస్ శర్మ, బిటవరం శ్రీధరస్వామి, జూలూరు నాగరాజు, మారేడోజు సదానందచారి, సహృదయ సంస్థ సభ్యులు 'ఎన్ వీఎస్ చారి, జేడీ ఆర్ట్స్ కల్చరల్ సొసైటీ నిర్వాహకులు జడల శివ తదితరులు కొనియాడారు. ఆమె మృతికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఓరుగల్లు అంటే ప్రీతి..



తెలుగు వారి అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనరాణికి అక్షర సుమాంజలి సమర్పించిన 65మంది రచయితలు రాసిన 'కొత్త కథలు' సంపుటాన్ని జమున ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జూలై 2018 త్యాగరాయ గానసభలో ఈ పుస్తకావిష్కరణ జరిగింది. ఈపుస్తకంలో నేను రాసిన 'నగరపు నాగుపాము' కథ చదివి మెచ్చుకున్నారు. 'నేను సినీ నిర్మాతను, దర్శకున్ని' అని వేదికపై పరిచయం చేసుకున్నా. ఆమె నన్ను అభినందించారు. వరంగల్ అంటే తనకిష్టమని, ఓరుగల్లు ప్రాంతం కవులకు నిలయమని ఆమె అన్నారు. ఆమె మృతి కళారంగానికి తీరని లోటు. ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా.

- డాక్టర్ ప్రభాకర్ జైనీ, సినీ దర్శకుడు, వరంగల్

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



తొర్రూరు: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం వెలికట్టలో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొరివి ఎల్లయ్య(46) గీత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే కల్లు తీసేందుకు పెద్దమాంగ్యతండా శివారులో గురువారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో మోకుజారి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రైనా ఎల్లయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. పెద్దమాంగ్య తండా శివారులో తాటిచెట్టు వద్ద విగత జీవిగ పడి కనిపించాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు సందీప్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

రైలుకింద పడి బల్దియా రిటైర్డ్ జవాన్ ఆత్మహత్య

- జమ్మికుంట వరకు మృతదేహాన్ని ఈడ్చుకెళ్లిన రైలు ఇంజన్

కాశిబుగ్గ: అనారోగ్య సమస్యలతో రైలుకింద పడి బల్దియా రిటైర్డ్ జవాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ – కాజీపేట రైల్వేస్టేషన్ల మధ్య గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ నయీంనగర్‌కు చెందిన గద్వాల ఉప్పలయ్య(73) వరంగల్ మహానగరపాలక సంస్థలో జవాన్‌గా పనిచేసి 15 ఏళ్ల క్రితం రిటైర్డ్ అయ్యాడు. కొంతకాలంగా ఆయన బీపీ, షుగర్‌తో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వచ్చి ప్రకాష్‌రెడ్డిపేట సమీపంలో అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి శరీరం రైలు ఇంజన్‌కు చిక్కుకుని జమ్మికుంట రైల్వేస్టేషన్ వరకు ఈడ్చుకుని వెళ్లింది. దీంతో రెండు కాళ్లు మోకాళ్ల వరకు తెగిపోయి తీవ్ర గాయాలై మృతి చెందాడు. జమ్మికుంటలో లోకో పైలట్ గమనించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. రైల్వే అధికారులు, పోలీసులు మృతదేహాన్ని రైలు నుంచి వేరు చేసి పోస్టుమార్టం నిమిత్తం జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని శుక్రవారం మృతుడి మనవడు గద్వాల రాహుల్‌కు అప్పగించారు.

వ్యవసాయాన్ని పండుగ చేసిన కేసీఆర్

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- రెడ్లవాడలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు, పక్కన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేసిన మహానుభావుడని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రెడ్లవాడ గ్రామంలో నెక్కొండ నుంచి ఇనుగుర్తి వరకు ఎస్సీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.12 కోట్లతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులు, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులు, రూ.కోటి 70 లక్షలతో గ్రామంలో అంతర్గత సీసీ రోడ్డు పనులకు నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి మంత్రి దయాకర్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తూ రైతుల కష్టాల్ని తీర్చుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, రైతుబీమా, రైతుబంధు, సాగునీటి ప్రాజెక్టులు, ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగు నీరు అందించి మూడు పంటలు పండే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్ల వంటి పథకాలు గతంలో ఎప్పుడైనా చూశారని అని గ్రామస్తులను అడిగారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో మరెక్కడా జరగడం లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అవకాశం ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటాన్నారు. ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సిఉందని, మరింత అభివృద్ధి చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి దయాకర్‌రావు నియోజకవర్గ పురోగతికి తోడ్పాటునందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, జెడ్పీటీసీ లావుడ్యా సరోజన, ఎంపీపీ జాటోత్ రమేష్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్లు జలగం సంపత్‌రావు, మారం రాము, సర్పంచ్‌లు రావుల శ్రీలత, లావుడ్యా హరికిషన్, మాలోత్ పూర్ణ, ఉప సర్పంచ్ బర్ల వీరభద్రయ్య, నాయకులు ఆవుల చంద్రయ్య, చల్లా చెన్నకేశరెడ్డి, కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బొల్లె బోయిన వీరస్వామి, అన్నంనేని సంతోష్‌కుమార్, గుండారపు రవీందర్‌రావు, సూరం రాజిరెడ్డి, ఆవుల శ్రీనివాస్, మాదాసు రవి, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కాపురానికి రానివ్వడం లేదని..

- రెడ్యాలలో భర్త ఇంటి ఎదుట భార్య నిరసన



ప్రశాంత్ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న మౌనిక, ఆమె తల్లిదండ్రులు

మహబూబాబాద్ రూరల్: కాపురానికి రానివ్వడం లేదని ఆరోపిస్తూ ఓ వివాహిత భర్త ఇంటి ఎదుట తల్లిదండ్రులతో కలిసి నిరసనకు దిగింది. మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామంలో శుక్రవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం వెంగంపేట గ్రామానికి చెందిన పిడుగు చంద్రమౌళి–పద్మ దంపతుల చిన్నకుమార్తె మౌనికను రెడ్యాల గ్రామానికి చెందిన మద్ది రాములు–నిర్మల దంపతుల కుమారుడు ప్రశాంత్‌కు ఇచ్చి 2022 మేలో వివాహం జరిపించారు. కట్నకానుల కింద ఎకరం పొలం, రూ.3 లక్షల నగదు అప్పజెప్పారు. వివాహం జరిగిన కొద్ది రోజుల తర్వాత ప్రశాంత్, మౌనిక మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మౌనిక ఆరు నెలల నుంచి తల్లిగారింటి వద్ద ఉంటుంది. ఏదైనా మాట్లాడితే అనారోగ్య కారణాలను సాకుగా చూపుతూ కాపురానికి తీసుకెళ్లడం లేదని మౌనిక ఆరోపిస్తుంది. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టినప్పటికీ ఎలాంటి ఫలితం లేదు. తనకు జరిగిన అన్యాయంపై ఈ నెల 24న గూడూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. 25వ తేదీ నుంచి రెడ్యాల గ్రామంలో తల్లిదండ్రులతో కలిసి మౌనిక భర్త ప్రశాంత్ ఇంటి ఎదుట నిరసన చేపట్టింది. దీంతో ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై మహబూబాబాద్ రూరల్ ఎస్సై సీహెచ్.అరుణ్‌కుమార్‌కు వివరణ కోరగా బాధితురాలు నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అరెస్టయిన అధికారులపై చర్యలేవి?

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు అరెస్టయి బెయిల్‌పై విడుదలై వారం గడుస్తున్నా ఉన్నతాధికారుల మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్ అక్రమ నాలా కన్వర్షన్ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు పాల్పడగా బాధితుల ఫిర్యాదు మేరకు వారం రోజుల క్రితం మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కాగా, పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదైన అధికారులపై ఉన్నతాధికారులు శాఖపరమైన చర్యలు తీసుకుంటారు. కానీ అందుకు భిన్నంగా వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ అరెస్ట్ అయిన అధికారులపై సస్పెన్షన్ వేటు వేస్తారని అధికారులు జంకుతున్నా.. ఉన్నతాధికారులు ఉలుకుపలుకు లేకుండా ఉన్నారని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో చర్చించుకుంటున్నారు.

చదువు ఇష్టం లేదని..

- నిద్రమాత్రలు మింగిన బాలిక

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ విద్యాలయంలో ఓ బాలిక చదువు ఇష్టం లేదంటూ నిద్రమాత్రలు మింగిన సంఘటన శుక్రవారం జరిగింది. ప్రిన్సిపాల్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొనుగోడుకు చెందిన బాలిక పూలే గురుకులంలో 8వ తరగతి చదువుతోంది. తనకు చదువు ఇష్టం లేదంటూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలలో ఉపాధ్యాయులను ఇబ్బందులు పెడుతుంది. ఈ క్రమంలో మూడుసార్లు అలాగే వ్యవహరించడంతో బాలికను విద్యాలయం నుంచి ఇంటికి పంపించారు. ఎలాగైన తమ కూతురును చదివించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు మూడు రోజు క్రితం బలవంతంగా పాఠశాలలో చేర్పించి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటి నుంచి వచ్చే ముందు తనతో తెచ్చుకున్న నిద్రమాత్రలు మింగి విద్యార్థిని స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఉపాధ్యాయులు బాలికను గూడూరు సీహెచ్‌సీలో చూపించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి వెంటనే మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

భూవివాదంలో ఒకరిపై దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిక

భూపాలపల్లి అర్బన్: భూవివాదం వ్యక్తిపై దాడికి దారి తీసింది. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగిన ఈ ఘటనలో ఓ వ్యక్తిపై.. మరో వ్యక్తి కర్రతో దాడి చేయడంతో తలకు తీవ్రమైన గాయమైంది. బాధితుడు దుర్శనపెల్లి రాంగోపాల్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లిలోని సుభాష్‌కాలనీకి చెందిన దుర్శనపెల్లి రాంగోపాల్‌కు కొంపెల్లి శివారులో సర్వే నెంబర్ 143లో 130 గజాల స్థలం ఉంది. కాగా, అదే స్థలంలో కృష్ణకాలనీకి చెందిన రమేష్ అనే వ్యక్తి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీంతో రాంగోపాల్ అడ్డుకున్నాడు. ఈ క్రమంలో రమేష్ కర్రతో రాంగోపాల్ తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయమైంది. దీంతో పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. ఇదే ఘటనలో తన వెంట ఉన్న మరో వ్యక్తికి కూడా స్వల్ప గాయాలైనట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, తనపై దాడి చేసిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఆటోను ఢీకొట్టిన రెడీమిక్స్ వాహనం

- 8 మందికి తీవ్రగాయాలు.. ఒకరి పరిస్థితి విషమం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబీకులు

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రహదారిలో గల నెల్లుట్ల బ్రిడ్జిపై రెడీమిక్స్ వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకోగా ఆటో బోల్తా పడి అందులోని 8 మందికి తీవ్రగాయాలు, మరో 8 మందికి స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మాధాపురం గ్రామానికి చెందిన ఆటో సుమారు 16 మంది ప్రయాణికులతో దేవరుప్పుల, కుందారం వైపు వెళ్తోంది. ఈ క్రమంలో జనగామ వైపు వస్తున్న రెడీమిక్స్ వాహనం మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో నెల్లుట్ల బ్రిడ్జిపై ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న కుందారం గ్రామానికి చెందిన వారితోపాటు దేవరుప్పుల మండలానికి చెందిన ప్రయాణికులు, రోజువారీ కూలీలు చెల్లాచెదురుగా పడిపోయారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో బ్రిడ్జిపై భయానక పరిస్థితి నెలకొంది. మారబోయిన రేణ, భక్తి నర్సయ్య, భవతి సంపత్‌కుమార్, మారబోయిన సత్తయ్య, అరవింద్, లకావత్ రవి, అనిత, శ్రావణ్‌కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చేరుకుని వారిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరో 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేయూ డిగ్రీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ మొదటి సంవత్సరం(రెగ్యులర్, బ్యాక్‌లాగ్) మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజు గడువును ఈనెల 30వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ శుక్రవారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 9నుంచి మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు.

నాలుగు తరాల ఆత్మీయ సమ్మేళనం



ఒకటి రెండు తరాల వారు కలవడమే ఈ రోజుల్లో అరుదు. అలాంటిది నాలుగు తరాల వారు ఒకే వేదికపై కలిశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలకేంద్రానికి చెందిన ముడుంబై లక్ష్మణాచార్యులు, లక్ష్మీనర్సమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు. వారు పరమపదించారు. ఈ ఐదుగురు కుమారుల తరాలకు చెందిన ముడుంబై కుటుంబీకులు 360మంది ఉండగా, వారిలో 260మంది మరిపెడలోని మాకుల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కలుసుకున్నారు. దీంతో ఆలయ ఆవరణ అంతా పండుగ వాతావరణం నెలకొంది.

\- మరిపెడ

నేటి నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్

- ఎల్బీ కళాశాల వేదికగా తలపడనున్న 24 క్రికెట్ జట్లు

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాల మైదానంలో శనివారం నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నట్లు బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఈ నిర్వహించే ఈ పోటీలను చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావులతో పాటు ప్రముఖులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. 21 సీనియర్ జట్లు, 3 జూనియర్ జట్లు పాల్గొంటాయని వెల్లడించారు. వారం రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో ప్రతి రో అరు జట్లు మూడు మ్యాచ్‌ల్లో తలపడుతాయని చెప్పారు. లీగ్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

నేడు జరిగే మ్యాచ్‌లు

- ఉదయం 9 గంటలకు మాస్టర్‌జీ కాలేజీ వర్సెస్ కేడీసీ
- ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల వర్సెస్ ఎల్బీ జూనియర్ కాలేజీ
- మధ్యాహ్నం 1.30 గంటలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ వర్సెస్ సీడీయూ–బీ టీమ్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘు



చోరీకి ఉపయోగించిన ఐరన్ లివర్, కట్టర్

మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలో వారం రోజులుగా జరుగుతున్న వరుస దొంగతనాలకు సంబంధించి అంతర్రాష్ట్ర దొంగను మరిపెడ పోలీసులు అరెస్ట్ చేశారు. పీఎస్‌లో తొర్రూరు డీఎస్పీ రఘు శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా కదిరి పట్టణం గజ్జిరెడ్డిపల్లి కాలనీకి చెందిన పోలసాని శివకుమార్‌పై తెలుగు రాష్ట్రాల్లో పన్నెండు చోట్ల కేసులు ఉన్నాయి. జైలుకు వెళ్లి వచ్చినా ప్రవర్తనలో మార్పు రాలేదు. నిందితుడు రేకుల కప్పు ఉన్న దుకాణాలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నాడు. అందుకు కేవలం ఐరన్ లివర్, కట్టర్ మాత్రమే ఉపయోగించడం గమనార్హం. ఈ నెల 21న తిరుపతి నుంచి మహబూబాబాద్‌కు చేరుకుని రైల్వేస్టేషన్‌లో పల్సర్ బైక్ దొంగిలించాడు. మరిపెడ వైపు వస్తుండగా సీరోలు పోలీస్‌స్టేషన్ పరిధి గుజిలితండా శివారులో కిరాణా షాపుపై రేకులు కనిపించాయి. అదే రోజు రాత్రి తన వెంట తెచ్చుకున్న లివర్, కట్టర్‌తో రేకులను కత్తిరించి కిరాణా షాపులోకి ప్రవేశించి రూ.2,480 దొంగతనం చేశాడు. అక్కడి నుంచి మరిపెడ బంగ్లాకు చేరుకుని వీఆర్ సెల్‌షాపు రేకులు కత్తిరించి 6 ఫోన్లు, ఇయర్ ఫోన్స్, మూడు స్మార్ట్‌వాచ్‌లు, రూ.20వేల నగదు చోరీ చేశాడు. దొంగిలించిన సొత్తుతో బైక్‌పై యాదగిరిగుట్టకు వెళ్లి అక్కడ కొద్ది రోజులు గడిపి తిరిగి మరిపెడ బంగ్లాకు చేరుకున్నాడు. కార్గిల్ సెంటర్ వద్ద పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి బైక్‌తో పాటు చోరీ చేసిన వస్తువులు, రూ.6,100 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ సాగర్, ఎస్సైలు దూలం పవన్‌కుమార్, సంతోష్, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా దొంగలు..



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ గిరికుమార్

వరంగల్ క్రైం : చిత్తు కాగితాలు ఏరే ముసుగులో చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను సీసీఎస్, మట్టెవాడ పోలీసులు అరెస్ట్ చేసినట్లు వరంగల్ ఏసీపీ గిరికుమార్ తెలిపారు. హనుమకొండ జిల్లా మడికొండ ప్రాంతానికి చెందిన అలేటి మైసమ్మ అలియాస్ కడమంచి మైసమ్మ, ఊర దివ్య, నూనె రామక్క, నూనె ఎల్లయ్య అలియాస్ గజ్జి ఎల్లయ్యను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2 లక్షల విలువైన జనరేటర్ రేడియేటర్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. మైసమ్మ, దివ్య రామక్క దగ్గరి బంధువులు. పాత ఇనుప సామగ్రి, చిత్తు కాగితాలు ఏరుకొని జీవించేవారు. ఈ క్రమంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ప్రముఖ కంపెనీకి చెందిన జనరేటర్ రేడియేటర్ చోరీ చేయాలని నిర్ణయించారు. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎల్లయ్య సహకారంతో ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున జనరేటర్ రేడియేటర్‌ను చోరీ చేశారు. కంపెనీ యాజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టారు. నిందితులు శుక్రవారం రేడియేటర్ అమ్మేందుకు రావడంతో అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చేసిన నేరం అంగీకరించడంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌కుమార్, శ్రీనివాస్‌రావు, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్సైలు యాదగిరి, శంకర్‌నాయక్, ఏఎస్సై శివకుమార్, హెచ్‌కానిస్టేబుల్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి అలవాటు పడి చోరీలు

- ఒకరి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కొత్తగూడ: తాగుడుకు బానిసై బైక్ దొంగతనం చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన బీరబోయిన వంశీ మద్యానికి, జల్సాలకు బానిసయ్యాడు. ఈ క్రమంలో గూడూరు మండలం నేలవంచకు చెందిన మద్దెల రమేష్ అనే వ్యక్తి కొత్తగూడ మండలం మోకాళ్లపల్లి గ్రామంలో బంధువుల ఇంటి ముందు పార్క్ చేసిన గ్లామర్ బైక్‌ను వంశీ గురువారం రాత్రి దొంగిలించాడు. శుక్రవారం వాహనాన్ని విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు అతడిని అరెస్ట్ చేసి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

క్రెడిట్ కార్డు యాక్టివేట్ చేస్తానంటూ ఫోన్..

- ఓటీపీ చెప్పడంతో రూ.19,999 మాయం

రామన్నపేట : క్రెడిట్ కార్డు యాక్టివేట్ చేస్తానంటూ అపరిచిత వ్యక్తి చేసిన ఫోన్‌కు స్పందించి ఓటీపీ చెప్పడంతో ఖాతా నుంచి రూ.19,999 మాయమయ్యాయి. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక గ్రామానికి చెందిన రాజు కిరాణా షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 23న వరంగల్ చౌరస్తాలో సామాను కొనుగోలు చేసేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అపరిచిత నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. క్రెడిట్ కార్డు యాక్టివేట్ చేస్తానని క్రెడిట్ కార్డు నంబర్‌తో పాటు, సీవీవీ, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని అవతలి వ్యక్తి కోరాడు. రాజు ఓటీపీ చెప్పడంతో అకౌంట్ నుంచి రూ.19,999 డెబిట్ అయ్యాయి. వెంటనే తనకు వచ్చిన నంబర్‌కు తిరిగి ఫోన్ చేయగా కలవలేదు. దీంతో 1930 కాల్ చేసి శుక్రవారం ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నయీంనగర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల బాధ్యులు, విద్యార్థులు

విద్యారణ్యపురి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదని, తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ రోడ్డులోని నయీంనగర్ సెంటర్‌లో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. పాలకవర్గాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.3వేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చాలా గురుకులాలకు సొంత భవనాలు లేవని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యార్థి సంఘాల బాధ్యులు మచ్చ పవన్‌కళ్యాణ్, నవీన్, విష్ణు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.